

సదర్ రోడ్డు కబ్జా


రహదారికి అడ్డంగా వ్యాపారి ఏర్పాటు చేసిన గోడ

- రహదారికి అడ్డంగా గోడ నిర్మాణం
- రూ.2 కోట్ల ప్రభుత్వ భూమికి ఎసరు
- ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు సన్నాహాలు
- జిల్లా కేంద్రంలో రియల్ వ్యాపారి నిర్వాకం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

మంచిర్యాల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాలలోగల పురాతన సదరు రోడ్డును కబ్జా చేసిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారికి అడ్డంగా గోడ నిర్మించినా అడిగేవారు కరువయ్యారు. జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ధనదాహానికి ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురవుతుండగా, రహదారులను కూడా కబ్జాలు చేస్తూ అక్రమంగా విక్రయిస్తున్నారు. పాత మంచిర్యాలలోని షిరిడీ సాయి బాబా ఆలయం వెనుకాల ఉన్న అత్యంత విలువైన సదరు బాట స్థలం అర ఎకరం కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లింది.

ప్రజా అవసరాల కోసం రహదారి ఏర్పాటు

సుమారు వంద సంవత్సరాల క్రితం ప్రతీ గ్రామంలో ప్రజల అవసరాల కోసం సదరు రోడ్డు (బాటలు) ఉండే వి. సదరు రోడ్డును ముఖ్యంగా వ్యవసా యం, పశువుల తరలింపునకు ప్రజలు వినియోగించేవారు. వంట చెరుకు కోసం అడవికి వెళ్లేందుకు సదరు రోడ్డును ఉపయోగించేవారు. అలాగే గ్రామంలోని పశువులను సమీపం లోని అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లేందుకు రైతులు ఈ రహదారు లనే వినియోగించేవారు. అలా గ్రామ అవసరాల రీత్యా పూర్వీకులు సద రు రోడ్డులను నిర్మించారు. ప్రభు త్వ స్థలాలు అందుబాటులో లేని చోట, పట్టేదారుల నుంచి మార్కెట్ ధరకు సేకరించి, రోడ్డు నిర్మాణం చేపట్టే వారు. అలా పాత మంచిర్యాలలో కూడా పూర్వీకులు సుమారు 8 కిలో మీటర్ల మేర 40 అడుగుల వెడల్పుతో రహదారి ఏర్పాటు చేశారు.

కబ్జా కోరల్లో సదరు బాట

పాత మంచిర్యాలలో ఉన్న సదరు రహదారి కోసం కేటాయించిన భూముల ధర ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.4 కోట్ల వరకు పలుకుతోంది. రహదారి నివాస గృహాలను ఆనుకొని ఉండటంతో కాలక్రమేణ కబ్జాదారుల కళ్లు దారిపై పడ్డాయి. ఏడెనిమిది సంవత్సరాల క్రితం రహదారిని అడ్డంగా సిమెంట్ స్తంభాలు పాతిన కొందరు దాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. అప్పుడు గ్రామస్థులు అడ్డుపడటంతో తమ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. రహదారిని కబ్జా చేసే కుట్రలో భాగంగా దాన్ని ఆనుకొని ఉన్న పట్టా భూములను కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు అదును చూసుకొని సర్కారు స్థలాన్ని ఆక్రమించారు. తాజాగా రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మాణం చేపట్టిన వ్యాపారి ఒకరు అక్కడ గతంలో నిర్వహించిన బందెల దొడ్డి స్థలం సర్వే పాత మంచిర్యాల శివారు సర్వే నెంబర్లు 181, 182లోని సుమారు అర ఎకరం కబ్జా చేశాడు. మార్కెట్ విలువ ప్రకారం ప్రస్తుతం ఆ స్థలం విలువ రూ.2 కోట్లపైనే ఉంటుంది.

అక్రమంగా వెలిసిన నిర్మాణాలు

రోడ్డుకు అడ్డంగా రియల్ వ్యాపారి గోడ నిర్మాణం చేపట్టగా, మరి కొన్ని శాశ్వత నిర్మాణాలు కూడా రహదారిపైన వెలిశాయి. సాయి బాబా ఆలయం మొదలుకొని శాలివాహన విద్యుత్ ప్లాంటు వైపు అక్కడక్కడ సదరు రోడ్డుపై ఏకంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టినా అడిగే నాథుడే లేకుండా పోయారు. గతంలో గ్రామ పెద్దలు కొందరు రహదారికి ఇరువైపులా సిమెంట్ స్తంభాలు పాతి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. భూముల ధరలు పెరగడంతో గుట్టుచప్పుడు కాకుండా ఇటీవల అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. రెవెన్యూ రికార్డుల్లోనూ ఇప్పటికీ 40 అడుగుల వెడల్పుగల సదరుబాట అలాగే ఉంది. అయినా సర్కారు భూమి కబ్జాకు గురవుతుం డటం గమనార్హం. సదరు రోడ్డు కబ్జా విషయమై గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సదరు బాటను రక్షించకపోతే పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.


పాత మంచిర్యాలలో ఉన్న పురాతన సదర్ రోడ్డు

విశిష్ట సేవలందిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సొసైటీ సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 5: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తోందని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న అనంతరం సొసైటీ సభ్యులు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ పలు కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి నర్సయ్య పాలక మండలిని ప్రకటించారు. జిల్లా చైర్మన్‌గా కంకణాల భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బొప్పు సతీష్, కోశాధికారిగా సత్యపాల్‌రెడ్డి, సభ్యులుగా మధుసూదన్‌రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, కిషన్, శరత్‌కుమార్, చంద్రమోహన్, పవన్‌కుమార్‌తివారీ, సంతోష్‌కుమార్, సత్యనారాయణ రెడ్డి, హరీష్, సత్యనారాయణరావు, శంకరయ్యలను ఎన్నుకున్నారు.

భూసర్వేను అడ్డుకున్న రైతులు


సర్వేకు వచ్చిన అధికారులతో రైతుల వాగ్వాదం

హాజీపూర్, మార్చి 5: మంచిర్యాల నుంచి నిజామాబాద్ వరకు నిర్మించనున్న గ్రీన్ వే జాతీయ రహదారి 63 విస్తరణ కోసం సర్వే అధికారులను మంగళవారం గుడిపేటలో రైతులు అడ్డుకున్నారు. భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు, ఇండ్లు కోల్పోయామని రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ సతీష్‌కుమార్ రైతులను సముదాయించడానికి ప్రయత్నించారు. రైతులు ససేమిరా అనడంతో సర్వే రెవెన్యూ అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

అక్రమ మట్టి రవాణాపై చర్యలు తీసుకోవాలి

జైపూర్, మార్చి 5: రామారావుపేట శివారులో నిర్మిస్తున్న రైసుమిల్లు వద్ద అక్రమంగా డంప్ చేసిన మట్టి కుప్పలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం డిప్యూటీ తహసీల్దార్‌కు కాంగ్రెస్ నాయకులు ఎండీ ఫయాజ్, విశ్వంబర్‌రెడ్డి, సుంకరి శ్రీనివాస్‌లు వినతిపత్రం అందించారు. గత నెల 23న రైసుమిల్లుకు అక్రమంగా మట్టి రవాణా జరుగుతుందని ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. విచారణ జరిపి అక్రమ మట్టి కుప్పలను సీజ్ చేయాలని కోరారు. రిక్కుల లక్ష్మీనారాయణ, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గోనె నర్సయ్యలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి

ఏసీసీ, మార్చి 5: ట్రెజరీ కార్యాలయాల్లో ఆమోదం పొంది ఆర్థిక శాఖ వద్ద రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, పీఆర్‌సీ, డీఏ బకాయిలు, సప్లిమెంటరీ జీతాలు, పింఛన్ బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజవేణులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి చెందిన బిల్లులు మంజూరు కాకపోవడంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ తర్వాత రీవాలిడేషన్ అవుతాయన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలన్నారు.

గిరిజనుల నివాసాలను కూల్చివేయడం అన్యాయం


విలేకరుల సమావేశంలో ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం నాయకులు

మందమర్రి టౌన్, మార్చి 5: పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న 407/5 సర్వేలో గిరిజన నివాసాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని నాయక్‌పోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది భార్గవ్, ప్రధాన కార్యదర్శి బైరినేని లక్ష్మణ్‌లు పేర్కొన్నారు. మంగళవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘిస్తూ గిరిజన భూముల్లో రియల్ వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. భూమి హక్కుదారుడైన బైరినేని వరప్రసాద్‌కు చెందిన భూమిలో వారి కుటుంబీకులే ఇంటి నిర్మాణం చేపట్టగా కూలగొట్టారన్నారు. గౌరవ అధ్యక్షుడు సౌడం రాజ్‌కుమార్, గుండం రాజేష్, భీంసేన్, పల్లె పృథ్వి, మల్లేష్, రఘు, పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి


అధికారులకు సూచనలు ఇస్తున్న అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్

చెన్నూరు, మార్చి 5: మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండ చూడాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నవీన్‌కుమార్ సూచించారు. కత్తెరసాల మల్లికార్జున స్వామి ఆలయం వద్ద జాతర ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ముందుగా స్వామి వారిని దర్శించుకున్నారు. దుకాణ సముదాయాల ఏర్పాటు, క్యూలైన్‌లు, భక్తులకు తాగునీటి సౌకర్యం, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈవో ముక్త రవి, పంచాయతీ ప్రత్యేకాధికారి మనోరమ,కార్యదర్శి ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా చంద్రకళ



ఆర్‌వోకు స్వాగతం పలుకుతున్న తహసీల్దార్, సిబ్బంది

చెన్నూరు, మార్చి 5: చెన్నూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా (ఆర్‌వో) మంగళవారం చంద్రకళ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్‌వోగా పనిచేసిన సిడాం దత్తు బోధన్‌కు బదిలీపై వెళ్లగా గద్వాల ఆర్డీవోగా పనిచేస్తున్న చంద్రకళను చెన్నూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించగా తహసీల్దార్ మల్లికార్జున్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీరాజం, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

సజావుగా ఇంటర్ పరీక్ష

ఏసీసీ, మార్చి 5: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా సజావుగా జరిగాయి. ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విభాగంలో 5648 మంది విద్యార్థులకు 5410 మంది హాజరు కాగా ఒకేషనల్ విభాగంలో 1128 మంది విద్యార్థులకుగాను 1100 మంది హాజరయ్యారు. మొత్తం 6776 మందికి 6510 మంది హాజరు కాగా 266 మంది గైర్హాజరయ్యారు. హాజరైన వారు 96.07 శాతం. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యవర్గం

ఏసీసీ, మార్చి 5: భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జిల్లా సర్వసభ్య సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని ప్రైవేటు హాలులో మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఐలన్న ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పడాల రామన్న, ఉపాధ్యక్షుడిగా గుండ లచ్చన్న, ప్రధాన కార్యదర్శిగా మంచర్ల సదానందం, కోశాధికారిగా అశోక్, కార్యదర్శులుగా దుర్గయ్య, మొండయ్య, ప్రచార కార్యదర్శులుగా శ్రీనివాస్, గణేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, సభ్యులు పాల్గొన్నారు.

11 నుంచి సదరం శిబిరాలు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 5: జిల్లాలో ఈ నెల 11 నుంచి నిర్వహించే సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవ ద్వారా స్లాట్‌బుక్ చేసుకోవాలని, సదరం సర్టిఫికెట్ కాల పరిమితి ముగిసిన వారు పునరుద్ధరణకు నిర్ణీత తేదీల్లో హాజరు కావాలని తెలిపారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటలకు స్లాట్ ఓపెన్ అవుతుందని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కారు బోల్తా : పలువురికి గాయాలు

మందమర్రిటౌన్, మార్చి 5 : మేడారం పై ఓవర్ బ్రిడ్జి వద్ద మంగళవారం కారు అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో తాండూర్‌కు చెందిన జంబోజు ప్రసాద్ స్వల్ప గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడ్డ ప్రసాద్‌ను వివరాలు తెలుసుకొని బెల్లంపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అనాథాశ్రమాలు కనీస ప్రమాణాలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 5: జిల్లాలో పిల్లల సంక్షేమం కోసం పనిచేసే అనాథాశ్రమాలు కనీస ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్యతో కలిసి అధికారులు, అనాథాశ్రమాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అనాథ్రాశమాలు బాలల రక్షణ చట్టం ప్రకారం కనీస ప్రమాణాలు పాటించాలని తెలిపారు. జిల్లాలోని అనాథాశ్రమాలను పరిశీలన కమిటీ ఇప్పటికే సందర్శించిందని, జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తారని, అన్ని అనాథాశ్రమ నిర్వాహకులు బాలల చట్టం ప్రకారం రిజిష్టర్‌లు, సీసీ టీవీలు, మెనూ, ఇతర అన్నిఅంశాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్, కేర్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సత్తయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

ఏసీసీ, మార్చి 5: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రానున్న లోక్ సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా, సజావుగా జరిగేలా చూడాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రామగుండం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ఎన్నికల నియామవళిపై అధికారులు, సిబ్బం ది అవగాహన కలిగి ఉండాలన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా నియోజక వర్గాల వారీగా సరిహద్దు వివరాలు, చెక్‌పోస్టుల ఏర్పాటు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్, ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత ప్రాంతం పోలింగ్‌స్టేషన్‌ల వద్ద భద్రత, రూట్ మొబైల్ టీంలు, బందోబస్తు, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఏర్పాట్లపై అధికారులకు సూచ నలు ఇచ్చారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ తర్వాత ఈవీఎంల, స్ట్రాంగ్ రూంల భద్రతపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఎన్నికల సంఘం నియంత్రణ, పర్యవేక్షణ, క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల సం బంధిత ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మావోయిస్టు ప్రభా విత ప్రాంతాల్లో అత్యంత ప్రభావిత పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సీఐలు, ఎస్‌ఐలు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లను విజిట్ చేయాలని సూచించారు. అక్రమంగా నగదు, మద్యం రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీ అశోక్‌కుమార్, పెద్దపల్లి డీసీపీ చేతన, మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర్లు, రవికుమార్, మంచిర్యాల ఆర్డీవో రమేష్, డీటీవో సంతోష్‌కుమార్, ఎస్‌ఐలు, తహసీల్దార్‌లు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి



సిబ్బందిని సన్మానిస్తున్న పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 5: జిల్లాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణతోపాటు ఇతర వ్యాధి నియంత్రణ టీకాలు వేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు రమేష్ అన్నారు. మంగళవారం గుడిపేటలోని రైతు శిక్షణ కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు పశువులకు వ్యాధి నియంత్రణ టీకాలు అందించేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. పశువైద్యులు, వెటర్నరీ సిబ్బంది, గోపాల మిత్రలు సమన్వయంతో పనిచేసి రైతులు తమ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని, షీప్ పాక్స్ వ్యాక్సినేషన్, థైలేరియా వ్యాక్సినేషన్ ప్రక్రియ ఒక వారంలోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశువైద్య సిబ్బంది సమయపాలన పాటించి రైతులకు సకాలంలో సేవలందించాలన్నారు. అనంతరం ఈనెల 8న అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ పశువైద్య సిబ్బందిని సన్మానించారు. జిల్లా పశు సంవర్ధక శాఖ సహాయసంచాలకులు శంకర్, డాక్టర్‌లహరి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యారంటీ పథకాల అమలుకు ప్రజాపాలన సేవా కేంద్రాలు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 5: ప్రజాపాలన గ్యారంటీ పథకాల అమలుకు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామని రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి రిజ్వీ అన్నారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గృహజ్యోతి కింద ఎంపికైన లబ్ధి దారులకు జీరో బిల్లులు పంపిణీ చేశామన్నారు. ప్రజాపాలన వివరాలు సక్రమంగా నమోదు చేయని దరఖాస్తు దారులు ప్రజాపాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని, అర్హులైన ప్రతీ ఒక్కరికి పథకాలు అందే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదనపు కలెక్టర్ రాహుల్, పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

అమలుకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ


మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ఏసీసీ, మార్చి 5: అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిం దని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళ వారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతమైనందున ఈ ప్రాంత అభివృద్ధికి కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో పార్టీ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించిందన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేశారని, దేశంలో ఏ సీఎం చేయనంతగా నీటి పారుదల రంగాన్ని, ప్రజారోగ్య వ్యవస్థను అభివృద్ధి చేసి ప్రజలందరికి అం దుబాటులోకి తెచ్చారన్నారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పటికీ 90 రోజులు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. తాను గోదావరిఖని వాస్తవ్యున్ని, గతంలో సింగరేణి కార్మికున్ని అయినందున సింగరేణి కార్మికుల సమ స్యల పరిష్కారానికి కృషి చేశానని, వేజ్‌బోర్డు, కార్మి కులు చనిపోయిన సందర్భంలో హక్కుల కోసం పోరా డానని గుర్తు చేశారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తనను ప్రజలు ఆదరించి ఎంపీగా గెలిపించాలన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజల పక్షాన పోరాడేందుకు బీఆర్ఎస్‌ను బలపర్చాలన్నారు. పెద్దపల్లి ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకునేం దుకు కార్యకర్తలు, నాయకులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ మాత్రమే తెలంగాణ ప్రాంత ప్రయోజనాలకు కట్టుబడి ఉందని, కాంగ్రెస్, బీజేపీలకు ఈ ప్రాంత ప్రయోజనాల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా ప్రజల నుంచి డబ్బులు తీసుకుని రెగ్యులర్ చేయవద్దన్నదని, ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు సిద్ధమైందన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులతో కలిసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు.


కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

దండేపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని మాజీ మంత్రి, కొప్పుల ఈశ్వర్ అన్నారు. పద్మశాలి సంఘం భవనంలో నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. రైతుబంధు, బీమా పథకాలను అమలు చేసి దేశంలో ఆదర్శంగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరచిందన్నారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌ను గెలుపునకు పని చేయాలన్నారు.

గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో కొప్పుల ఈశ్వర్, దివాకర్ రావుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, సిబ్బంది మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలను సన్మానించారు. డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, లింగన్న, గడిపెల్లి సత్తయ్య, పాల్గొన్నారు.







రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, మార్చి 5: బెల్లంపల్లిలోని కన్నాల బ్రిడ్జి సమీపంలో మంగళవారం రైలు కింద పడి బెల్లంపల్లి బస్తీకి చెందిన రవికుమార్ (35) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి తెలిపారు. రవికుమార్ ఆటో డ్రైవర్‌గా జీవిస్తుండేవాడు. కొన్ని నెలల నుంచి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో పశువులు మృతి


జైపూర్, మార్చి 5: మండల కేంద్రంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆవు దూడ మృతి చెందిందని వాటి యజమాని సిద్దం సత్తన్న తెలిపాడు. సోమవారం ఉదయం మేత కోసం వెళ్లిన ఆవుదూడలు రాత్రి అయినా రాకపోవడంతో మంగళవారం ఉదయం గాలించగా జాతీయ రహదారిపై మృతిచెంది ఉన్నాయని ఆయన తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 40 వేలు ఉంటుందని పేర్కొన్నాడు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్

జైపూర్, మార్చి 5: రామారావుపేట శివారులో అనుమతులు లేకుండా 38 ట్రాక్టర్ల ఇసుక కుప్పలను సీజ్ చేశామని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. చేపల చెరువు దగ్గర వరలక్ష్మీ ఆగ్రో ఇండస్ట్రీస్ వెనుక ఖాళీ ప్రాంతంలో ఇసుక నిల్వ చేశారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెళ్లి సీజ్ చేసి మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగించామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఆర్ఐ తిరుపతి, మైనింగ్ సిబ్బంది రాహుల్ పాల్గొన్నారు.

22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఏసీసీ, మార్చి 5: మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టి వాడ, సూర్యనగర్ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించి అక్రమంగా రవాణా చేస్తున్న 22 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. మంచిర్యాల, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రాకేష్, తిరుపతి, రాజులు తనిఖీలు చేయగా టీఎస్26టీఏ1280 నంబరు గల వ్యాన్‌లో ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన వానరని ఉమామహేశ్వర్ అలియాస్ మహేందర్ సుమారు రూ. 70,400 విలువ గల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యంతో ఉన్న వాహనాన్ని, నిందితున్ని మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.













మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

మందమర్రి టౌన్, మార్చి 5: పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ కాంగ్రెస్ యూత్ నాయకులు మంగళవారం కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని ఆయా వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. అంతే కాకుండా ప్రజలకు వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నాయకులు నయీం, కమలాకర్, రాజశేఖర్, భాస్కర్, ఎండి అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ ప్రతిపాదనలు అందించిన

పీఆర్‌టీయూ నాయకులు

ఏసీసీ, మార్చి 5 : రాష్ట్ర పే రివిజన్ కమిషన్ ఛైర్మన్ శివశంకర్‌కు రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని మంగళవారం హైద్రాబాద్‌లో పీఆర్‌టీయూ తెలంగాణ నాయకులు ప్రతిపాదనలు అందజేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు ఛైర్మన్‌ను కలిసి ప్రతిపాదనలు అందించారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను తగ్గించాలని, సర్వశిక్ష అభియాన్, కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ అమలు చేస్తూ సంవత్సరానికి 22 సీఎల్‌లు, 5 ఆప్షన్ హాలీడేలు కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

మాక్ పోలింగ్‌తో విద్యార్థులకు అవగాహన


భీమిని పాఠశాలలో మాక్ పోలింగ్

నెన్నెల, మార్చి 5: ఓటు హక్కు, ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు మాక్ పోలింగ్ దోహదపడుతుందని స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాలలో మంగళవారం నమూనా ఎన్నికలను ఆయన పరిశీలిం చారు. విద్యార్థులే అధికారులుగా, పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించారు. కౌంటింగ్ చేసి విజేతలను ప్రకటించే వరకు నమూనా పోలింగ్ కొనసాగింది. తహసీల్దార్ సబ్బ రమేష్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

హాజీపూర్: ముల్కల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలిం గ్ నిర్వహించారు. ఎన్నికలను మండల అభివృద్ధి అధికారి మధుసూదన్ పరిశీలించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులతో ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీవో శ్రీనివాసరెడ్డి, ప్రధానో పాధ్యాయుడు గణపతిరెడ్డి, మల్లేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమిని: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వ హించారు. పోలింగ్, ఈవీఎంపై ఓటింగ్ విధానం, కౌంటింగ్‌పై విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, జీవన్, సువర్ణ, శ్రీధర్, శ్రీనివాస్, మల్లేషం, రవి, రామయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


నెన్నెలలో నమూన పోలింగ్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో, ఎంపీడీవో

కోటపల్లి: జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు మాదిరి ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకు న్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా లక్ష్మీనారాయణలు వ్యవహరించారు.

ఐటీడీఏ కాలనీలో బోర్‌వెల్ ఏర్పాటు



భీమారం, మార్చి 5: భీమారంలోని ఐటీడీఏ కాలనీలో మంగళవారం బోర్‌వెల్ వేయించినట్లు జెడ్పీటీసీ తిరుమలలక్ష్మణ్ తెలిపారు. జడ్పీటీసీ మాట్లాడుతూ నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు బోర్‌వెల్ వేయించామన్నారు. మండలానికి 15 బోర్‌వెల్‌లు ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.90 లక్షలు మంజూరయ్యాయన్నారు. మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు పోడేటి రవి, వేల్పుల శ్రీనివాస్, సత్తిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మండల పరిషత్ సూపరింటెండెంట్ మృతి

నెన్నెల, మార్చి 5: మండల పరిషత్తు కార్యాలయంలో సుపరింటెండెంట్‌గా పని చేస్తున్న నుగూరి రాధాకృష్ణ (60) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. పది రోజులుగా కిందట గుండె సంబంధిత వ్యాధితో హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. 8 ఏళ్ల పాటు ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఇన్‌చార్జీ ఎంపీడీవోగా సేవలందించారు. డిప్యుటేషన్‌పై కొన్నాళ్ల పాటు కన్నెపల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేశారు. ప్రభుత్వం డిప్యుటేషన్లను రద్దు చేయడంతో ప్రస్తుతం నెన్నెలలో సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్నారు. నిబద్ధత గల అధికారిగా ఆయనకు పేరుంది. ప్రజలతో, సిబ్బందితో కలుపుగోలుగా ఉండే రాధాకృష్ణ మృతి చెందటం విచారకమని కార్యాలయ సిబ్బంది పేర్కొన్నారు. ఆయన స్వస్థలం ధర్మపురి కాగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో నివసిస్తున్నారు. ఆయనకు భార్య, ఒక కూతురు ఉన్నారు.

టీజీటీ సాధించిన గురుకుల విద్యార్థిని


నియామక పత్రంతో దుర్గం అఖిల

జన్నారం, మార్చి 5 : మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన దుర్గం అఖిల టీజీటీ సైన్స్ ఉద్యోగాన్ని సాధించి సోమవారం హైద్రాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. అఖిల 5 నుంచి 12వ తరగతి వరకు కడెం మండలం నచ్చెన్ ఎల్లాపూర్ లోని సాంఘిక సం క్షేమ గురుకుల పాఠశాలలో చదివారు. డీగ్రీ, బీఈడీ పూర్తి చేసి గురుకుల టీచర్‌గా ఉద్యోగం సాధించడంపై పలువురు అభినందించారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

జైపూర్, మార్చి 5 : మండలంలోని వేలాల గ్రామానికి చెందిన దుర్గం విజయ్‌కుమార్ మండల బీజేవైఎం అధ్యక్షుడిగా నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాధ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవి రావడానికి సహకరించిన బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివకృష్ణ, చెన్నూరు అసెంబ్లీ నాయకుడు దుర్గం అశోక్, మండల అధ్యక్షుడు దుర్గం ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

హోమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షురాలు



ఏసీసీ, మార్చి 5 : మంచిర్యాల పట్టణంలోని 26వ వార్డు గౌతమి నగర్‌లోని కోదండరామాలయంలో మంగళవారం నిర్వహించిన చండీ సహిత రుద్ర హోమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయకమిటీ సభ్యులు సురేఖను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డైరీ విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 5: టీఆర్‌వీకేఎస్ విద్యుత్ సంఘం డైరీని జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో ఎస్ఈ శేషారావు విడుదల చేశారు. అధికారులు శ్రీనివాస్, కైసర్, బాలకృష్ణ, స్వామి, రాజశేఖర్, రమేష్‌కుమార్, భాస్కర్, మల్లేశం, జయకృష్ణ, పాల్గొన్నారు.

డీఆర్‌డీవోకు సన్మానం

నెన్నెల, మార్చి 5: జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌ను మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఏపీఎం విజయలక్ష్మి, ఏపీవో నరేష్, వివిధ గ్రామాల కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

భీమారం, మార్చి 5 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యులు సుగుణాకర్‌రెడ్డి పరీక్షలు నిర్వహిం చారు. కంటి సమస్యలున్న వారిని బస్సు సౌకర్యం కల్పించికరీంనగర్‌లోని రేకుర్తి కంటి వైద్య ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయిస్తామని తెలిపారు.

చెలిమనీరే దిక్కు

- తాగునీటి కోసం సాలెగూడ ప్రజల కష్టాలు
- పనిచేయని మిషన్ భగీరథ పథకం
- పట్టించుకోని అధికారులు, నాయకులు

గిరిజనులకు చెలిమల నీరే తాగునీరు. కొంతకాలంగా మిషన్ భగీరథ పథకం నుంచి రక్షిత తాగునీరు రాకపోవడంతో సమీపం లోని వాగులో చెలిమ తోడి నీళ్లు బిందెల్లో నింపుకుని దాహం తీర్చుకుంటున్నారు. రక్షిత నీరు కాకపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నారని వాపోతున్నారు.


చెలిమె వద్ద నీరు పడుతున్న మహిళలు

వాంకిడి, మార్చి 5: వాంకిడి మండలం ఖమన గ్రామ పంచాయతీలోని సాలెగూడ గ్రామంలో మిషన్ భగీరథ పథకం పని చేయక పోవడంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సాలెగుడ గ్రామంలో సుమారు 25 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో సుమారు వంద జనాభా నివసిస్తున్నారు. గ్రామంలో వారం రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో కిలో మీటరు దూరంలోని వాగు నుంచి చెలిమెలు తీసి నీటిని మొసుకు రావాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రెండు బిందెల నీళ్లకు గంట..

చెలిమ నుంచి రెండు బిందెల నీరు తెచ్చుకునేందుకు గంటకు పైగానే సమ యం పడుతోందని మహిళలు చెబుతున్నారు. సాలెగూడకు సుమారు కిలో మీటరు దూరంలో వాగు ఉంది. ప్రస్తుతం వేసవి తాపం పెరిగి పోతుండడం తో ఒక్కో కుటుంబానికి కనీసం రెండు బిందెల తాగునీరు అవసరం. అలా రెండు బిందెల నీరు తెచ్చేందుకు ఒక్క మనిషి రెండు గంటల సమయం వెచ్చించాల్సి వస్తోంది. బిందెల్లో నీరు నింపేందుకు గంట, ఇంటి నుంచి వాగుకు, తిరిగి ఇంటికి చేరుకునేందుకు గంత సమయం పడుతోం దని చెబు తున్నారు. ప్రస్తుతం వేసవి ప్రారంభంలోనే ఇంత ఇబ్బందులు పడుతు న్నా

అధికారులు చర్యలు తీసుకోవాలి..



సాలెగుడ గ్రామంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా నీరు రావడంలేదు. దీంతో కిలోమీటరు దూరంలోని వాగులో చెలిమెలు తీసి నీటిని మొసుకు వస్తున్నాం. గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చాలని ఉన్నతాధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించు కో వడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- ఆత్రం గోపాల్, గ్రామస్థుడు


కిలోమీటరు దూరం నుంచి తాగునీరు తీసుకొస్తున్న మహిళలు

అధికారులు పట్టించుకోవడం లేదు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడితో తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వాపోతున్నారు. గతంలో పలు మార్లు గ్రామంలో తాగునీటి కోసం బోర్ వేసినప్పటికీ చుక్క నీరు పడలేదని ప్రజలు చెబుతున్నారు. గత ఏడాది గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా రక్షిత మంచినీరు అందించేందుకు అధికారులు వేసిన బోరు ఇప్పటికీ పనిచే యడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. గ్రా మంలో మిషన్‌భగీరథ పథకం పనిచేయడం లేదని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై మిషన్ భగీరథ డీ ఈ ఇర్ఫాన్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మని తెలిపారు.

మావోయిస్టులకు సహకరించొద్దు


ఆదివాసీలతో మాట్లాడుతున్న పోలీసులు

జైనూర్, మార్చి5: యువత మావోస్టులను సహకరించి బంగారు భవిష్యతును నాశనం చేసుకోవడద్దని సిర్పూర్(యు) ఎస్సై రాజు అన్నారు. మండలంలోని పవర్‌గూడ వర్‌గూడ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎస్సై రాజు ఆసిఫాబాద్ ఎస్సై మహెందర్, ఆర్ఎస్సై సందీప్, స్పెషల్ పార్టీ బలగాలతో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మావోయిస్టులు సంచరించే అవకాశం ఉందన్నారు. ఆపరి చిత వ్యక్తులతో మాట్లడకూడదని, వారికి ఆశ్రయం ఇవ్వకూడదని సూచించారు.

పల్లె ప్రకృతి వనంపై పట్టింపేదీ?


దెబ్బతిన్న కంచె

పెంచికలపేట, మార్చి 5: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనంపై పట్టింపు కరువైంది. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు ఉన్నతాధికారుల పర్యవేక్షణ, అధికారుల నిర్వహణలోపం కారణంగా అధ్వానంగా మారుతున్నాయి. మం డలంలోని కొత్తచెడ్వాయి గ్రామంలో నిర్మించిన పల్లె ప్రకృతి వనమే ఇందుకు ఉదాహరణ. నిర్వహణ లేక మొక్కలు ఎండి పోతున్నాయి. కూర్చోవడానికి ఒక బెంచీ కూడా లేదు. కనీసం బోర్డు, గేటు కూడా ఏర్పాటు చేయలేదు. ఊరికి దూరంగా ఉచ్చమల్లవాగుకు ఆనుకున ఉండడంతో వరదకు గుర్రై కంచే సైతం శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ప్రకృతివనాన్ని వినియో గంలోకి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.


ఎండిపోయిన చెట్లు

సీపీఎస్ విధానం రద్దు చేయాలి

- పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్


సభ్యత్వ నమోదు చేపుడుతున్న పీఆర్టీయూటీఎస్ నాయకులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 5: సీపీఎస్ విధానం రద్దు చేయాలి పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ విదానం వెంటనే రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో దశల వారి ఉద్యమం చేపడుతామని తెలిపారు. కా ర్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి స్వామి, జిల్లా ట్రేజరర్ గజానాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు ఆచారాలు మరువొద్దు

కెరమెరి, మార్చి 5: ఆదివాసీలు వారి ఆచారాలను మరువద్దని ఝరి రాయ్‌సెంటర్ సర్‌మేడి ఆత్రం బొజ్జిరావు అన్నారు. మంగళవారం ఝరి గ్రామం లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఆత్రం లక్ష్మణ్ రావు, దింబిరావు, జంగు, శంకర్, దేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడాలి

జైనూర్, మార్చి 5: మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడాలని జైనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఇందిర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిం చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పింటుబాయి, లైల పాల్గొన్నారు.



'నామినేటెడ్' నజర్

- మార్కెట్ కమిటీ పదవులపై నాయకుల గురి
- జిల్లాలో మూడు మార్కెట్ కమిటీలు
- రిజర్వేషన్ల ఖరారుతో చిగురిస్తున్న ఆశలు
- పార్లమెంట్ ఎన్నికల లోపే నియమించే అవకాశం
- ఇన్‌చార్జి మంత్రి మద్దతు కోసం ఆశావాహుల యత్నం

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 5: జిల్లాలో వ్యవసాయ మార్కెట్లకు నూతన కమిటీల ఏర్పాటుకు రిజర్వేషన్లను ప్రకటించడంతో కాంగ్రెస్ నా యకులు నామినేటెడ్ పదవులపై దృష్టి సారించారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయ మార్కెట్లకు పాలక వర్గాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాలతో సంబంధిత శాఖ అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఆసిఫాబాద్ బీసీ మహిళ, కాగజ్‌నగర్ ఎస్సీ జనరల్, జైనూరు ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. నూతన కమిటీల పదవీ కాలం రెండు సంవత్సరాలతో పాటు ఆరు నెలల చొప్పున రెండు సార్లు పదవీ కాలాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జి మంత్రులు సిఫార్సు చేసిన వారిని నియమించే అవకాశం ఉండడంతో ఆశావాహులు మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. త్వరలో లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీల ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

కమిటీలో 18 మంది సభ్యులు..

కొత్తగా ఏర్పాటయ్యే మార్కెట్ కమిటీలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌తో కలిపి 18 మంది సభ్యులు ఉంటారు. ఇందులో మార్కెట్ కమిటీ పరిధిలోని రైతులే ఉండాల్సి ఉంటుంది. వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి కనీసం ఐదుగురు సభ్యులు ఉండాలి. వీరిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు ఉండాలి. మార్కెట్ పరిధిలో లైసెన్సు పొందిన వ్యాపారులు ఇద్దరు, సహకార సంఘాల నుంచి ఒకరు, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి, వ్యవసాయంతో పాటు అనుబంధ శాఖాధికారి ఒకరు, మార్కెట్ పరిధిలోని గ్రామ సర్పంచ్ లేదా మున్సిపల్ ఛైర్మన్‌లలో ఒకరు సభ్యు లుగా ఉంటారు. పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి స్థానిక ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో మార్కెటింగ్ శాఖకు పంపిస్తారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా మార్కెట్ కమిటీ ఏర్పాటుకు రిజర్వేషన్ ఖరారు కావడంతో ఆశావాహులు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎవరికి వారే తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఆసిఫా బాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పదవిని ఎవరిని వరిస్తుందన్నదే ఆసక్తికరంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కోవ లక్ష్మి ఉన్నారు. దీంతో కాంగ్రెస్ నేతల్లో ఇన్‌చార్జి మంత్రి ఆశీస్సులు ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ నెలకొంది. ఛైర్‌పర్సన్ రేసులో పలువురు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా స్థానిక కాంగ్రెస్ నాయకులు మహిళా కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షురాలు ఇరుకుల్ల మంగ పేరును సిఫార్సు చేసినట్లు సమాచారం. జైనూరు నుంచి పంద్రోశకు, పెందూరు ప్రకాష్, కుడ్మెత విశ్వనాథ్ దరఖాస్తు చేసుకున్నారు. కాగజ్‌నగర్ నుంచి సిద్దల దేవయ్య పేరు ప్రతిపాదించినట్లు సమాచారం.


ఆసిఫాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

మహిళలకు ముగ్గుల పోటీలు

జైనూర్, మార్చి 5: మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జైనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఇందిర మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పోటీ పడాలన్నారు. లక్ష్యాన్ని సాధించుకున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమతుందన్నారు. ప్రతి రంగంలోనూ మహిళలు పోటీ తత్వంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పింటుబాయి, లైల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితుడికి జడ్పీటీసీ పరామర్శ

జైనూర్, మార్చి 5: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బీఆర్‌ఎస్ సీనియర్ జిల్లా నాయకుడు మేస్రాం అంబాజీరావ్‌ను మంగళవారం జడ్పీటీసీ కోవ అరుణ, ఎంపీపీ కుంర తిరుమల, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కనక యాదవ్‌రావ్ తదితరులు పరామర్శించారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

బెజ్జూరు, మార్చి 5: మండల కేంద్రానికి చెందిన కావుడే మధునయ్య మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా పోస్టాఫీసులో ప్రమాద బీమా చేసుకోవడంతో అతని భార్య నామిని గంగుబాయికి రూ.10 లక్షల బీమా చెక్కును కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్, మంచిర్యాల బ్రాంచి సీనియర్ మేనేజర్ వెంకటేష్, చీఫ్ మనేజర్ భాస్కర్, బ్రాంచి మేనేజర్ సాగర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పని సరిగా బీమా చేసుకోవాలని చెప్పారు. బీమాతో కుటుంబానికి ధీమా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పోస్టు మాస్టర్ చంద్రశేఖర్, వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

వాంకిడి: మండలంలోని మోకాసిగూడ గ్రామానికి చెందిన కోట్నాక పోతాబాయికి మంగళవారం రూ.2 లక్షల ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా చెక్కును బ్యాంకు మేనేజర్ నందకృష్ణ అందజేశారు. గత నాలుగు నెలల క్రితం కోట్నాక రఘునాథ్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా చేయించుకోవడం వల్ల అతని భార్యకు చెక్కు అందజేశామని మేనేజర్ నందకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఏ వివేక్, సీఎస్పీ భిక్షపతి, సిబ్బంది తదితతరులు పాల్గొన్నారు.

నాయకులు మనోధైర్యం కోల్పోవద్దు

రెబ్బెన, మార్చి 5: సింగరేణి ఎన్నికల్లో ఓటమి చెందినంత మాత్రాన నాయకులు మనోధైర్యం కోల్పోవద్దని ఐఎన్‌టీయూసీ యూనియన్ సీనియర్ నాయకులు రాజమౌళి అన్నారు. మంగళవారం స్థానికంగా సంఘ నాయకులతో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. సమావేశంలో శ్రీనివాస్, మాధవ కృష్ణ, చంద్రకుమార్, పెరం శ్రీనివాస్ పాల్గొన్నారు.

గడ్డివాము దహనం

కాగజ్‌నగర్, మార్చి 5: కాగజ్‌నగర్ గుంటూరు కాలనీలో నివాసం ఉంటున్న గంట హరిబాబు ఇంటి ఆవరణలో ఉన్న గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి దహనం చేశారు. కాలనీవాసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పట్టణ సీఐ శంకరయ్య అక్క డికి చేరుకుని వివరాలు సేకరించారు. సుమారు రూ. 3లక్షలు నష్టం వాటిల్లిందని, అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరాడు.


కాలిపోతున్న గడ్డి

ప్రజాపాలన సేవా కేంద్రాలు ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రె

ఆసిఫాబాద్, మార్చి 5: జిల్లాలో ప్రజాపాలన సేవా కేంద్రాలను పూర్తి స్థాయి ఏర్పాట్లతో త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దౌత్రె అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ శాఖల అధికారులు, మండల పరిషత్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమంకోసం చేపట్టిన గ్యారంటీ పథకాలు పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లాలో ప్రజాపాలన సేవా కేంద్రాలను పూర్తిస్థాయి ఏర్పాట్లతో త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్, జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో సాంకేతిక విభాగంపై ప్రత్యేక దృష్టి సారించి దరఖాస్తులను డిజిటలైజ్ చేయడంలో జాగ్రత్త వహించాలని తెలిపారు. జిల్లాలో 1.60 లక్షల దరఖాస్తులు వచ్చాయని, అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్, విద్యుత్ పథకాలను అమలు చేయడంలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని చెప్పారు. మొబైల్, ఓటీపీ, ఆధార్, రేషన్ కార్డులు, దరఖాస్తు, గ్యాస్ బుక్ సంఖ్య, డెలివరీ రిపోర్ట్ అన్ని వివరాలను పరిశీలించాలని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలలో ఐదు, పట్టణ ప్రాంతాల్లో రెండు ప్రజాపాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. కంప్యూటర్ ఆపరేటర్లు, సహాయకులతో జూమ్‌మీటింగ్ ద్వారా దశల వారీగా వివరాలు పర్యవేక్షించాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తమపరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, కొనసాగుతున్న పనులపై క్షేత్రస్థాయి అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. వేసవి కాలం అయినందున పని ప్రదేశాల్లో తప్పని సరిగా తాగునీరు, నీడ, వైద్య సేవలు ఇతర అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల పరిధిలో పన్నులను వంద శాతం వసూలు చేసి వివరాలు అందించాలన్నారు. వేసవికాలం కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జిల్లాలోని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, బోర్ వెల్స్, పైపులైన్, ట్యాంకులకు అవసరమైన మరమ్మతులు చేపట్టి నిరంతరాయంగా తాగునీటిని అందించే విధంగా నీటి సరఫరా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దౌత్రె

● అర్హులందరికీ గ్యారంటీ పథకాలు

- రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ

ఆసిఫాబాద్, మార్చి 5: అర్హులందరికీ గ్యారంటీ పథకాల ఫలాలు అందజేస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్‌ఏఎం రిజ్వీ అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అధికారులతో ప్రజా పాలన సేవా కేంద్రాల సాఫ్ట్‌వేర్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా గ్యారంటీ పథకాల లబ్ధిదారుల ఎంపికకు అవసరమైన ధ్రువపత్రాలు సేకరించి ప్రజాపాలన సాఫ్ట్ వేర్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని చెప్పారు. తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్, విద్యుత్‌కనెక్షన్ల వివరాలు అనుసందానమై ఉన్న దరఖాస్తుదారులకు ఇప్పటికే ప్రభుత్వ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. గృహజ్యోతి కింద ఎంపికైన లబ్ధిదారులకు జీరో బిల్లులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల సమయంలో వివరాలు సక్రమంగా నమోదు చేసుకోని దరఖాస్తుదారులు, నూతన ప్రజాపాలన దరఖాస్తు చేసుకునే వారు ప్రజాపాలన సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ దౌత్రె, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ జిల్లాలో ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్యారంటీ పథకాల అమలులో భాగంగా జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల ఫలాలు అందే విధంగా చర్యలు చేపడుతామని వివరించారు.

● ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలి

ఆసిఫాబాద్, మార్చి 5: పార్లమెంట్ ఎన్నికలు జిల్లాలో సజావుగా సాగే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ వెంకటేష్ దౌత్రె అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వరరావు కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా సవరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయంలో పని చేయాలని సూచించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి



మహిళలను సన్మానిస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్, మార్చి 5: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి పిలుపునిచ్చారు. మండలంలోని కేజీబీవీ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం అభినందనీయమని చెప్పారు. అనంతరం ఇటీవల వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల బాధ్యులు హారిక, స్వాతి, ప్రసన్న, సాయి, రమణి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేత

ఆసిఫాబాద్, మార్చి 5: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ వెంకటేష్ ధోత్రెను మంగళవారం కాంగ్రెస్ నాయకులు, పీఆర్టీయూ నాయకులు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలి సి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మంగ, మురళీ, రవీందర్, బాలయ్య, సురేష్, శ్రీకాంత్, అబ్బు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ప్రకాష్, భిక్షపతి, శంకర్ పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 5: యువతకు క్రీడలతో బంగారు భవిష్యత్ ఉంటుందని గిరిజనసంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్ రమాదేవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాలలో ప్రవేశానికి జిల్లా స్థాయి పోటీలు ప్రారంభించారు. ఇందులో 24, బాలురు 74 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో క్రీడాధికారి మీనారెడ్డి, ఏసీఎంఓ ఉద్దవ్, జీసీడీఓ శకుంతల, ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, సుధాకర్, ఎస్‌జీఎఫ్ సాంబశివరావు, కార్యదర్శి కృష్ణమూర్తి, కోచ్ విద్యసాగర్, అరవింద్, తిరుమల్, ఉపాధ్యాయులు బిక్కు, వినోద్, షరీఫ్, లక్ష్మణ్, మంగపతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్‌లో పాఠశాలను సందర్శించిన జిల్లా బృందం

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 5: ఉత్తరాఖండ్ రాష్ట్రం లోని ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలు తీరును, విద్యార్థుల అభ్యసన ఫలితాలు, ఉపాధ్యాయులు అవలంబిస్తున్న బోధన పద్ధతులను పరిశీలించేందుకు క్షేత్రస్థాయిలో జిల్లా రూం టు రీడ్ బృందం సభ్యులు మంగళవారం సందర్శిం చారు. జిల్లా క్వాలిటీ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రధా నోపాధ్యాయుడు హన్మంతు, జెన్నిఫర్ రాణిలు డెహ్రాడూన్ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు భోజనం తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీ లించారు. కార్యక్రమంలో రూమ్ టు రీడ్ రాష్ట్ర కోఆర్డినే టర్ ప్రవీణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

10న విశ్వ బ్రాహ్మణ మండల శాఖ ఎన్నికలు

కాగజ్‌నగర్, మార్చి 5: కాగజ్‌నగర్ మండల శాఖ విశ్వబ్రాహ్మణ సంఘానికి ఈ నెల 10వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మణాచారి, ప్రధాన కార్యదర్శి నల్గొండ సదాశివ చారి మంగళవారం ఒక ప్రకనటలో తెలిపారు. 6 నుంచి నామినేషన్ల స్వీకరణ, 7వ తేది మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందని తెలిపారు. 7 రోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల లోపు ఉపసంహరణ, 10న ఎన్నికల కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు మండలంలోని విశ్వబ్రాహ్మణులు తప్పకుండా హాజరు కావాలని వారు కోరారు.

విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్, మార్చి 5: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పక్షా అంతా అవగాహణ పెంచుకోవాలన్నారు. ఎయిడ్స్ ముందస్తు జాగ్రత్తతోనే దరికి రాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి సుశీల్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, మోతీరాం, జనార్ధన్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆసిఫాబాద్, మార్చి 5: పట్టణంలోని సీహెచ్‌సీలో పని చేస్తున్న థర్డ్ పార్టీ కాంట్రాక్టు ఉద్యోగులుకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, దివాకర్, నవీన్, రమేష్, శేఖర్,పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 5: మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని మాలన్‌గంది గ్రామంలో మంగళవారం మహిళలకు రుణాలు, వినియోగంపై ఎంపీపీ మల్లికార్జున్, పీఏసీఎస్ ఛైర్మన్ అలీబీన్ అహ్మద్, ఏపీఎం శ్రీనివాస్‌లు మంగళవారం అవగాహన కల్పించారు. వాటర్ షెడ్ ద్వారా రూ.22.99 లక్షల,బ్యాంకు రుణం రూ.49.51 లక్షలు, స్త్రీ నిధి కింద రూ.28 లక్షల మొత్తం రూ.1.50 కోట్ల రుణం ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ హోక్టు, సీసీలు హనుమంతు, మంగ, వీఓఏలు సుదర్శణ్, దర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

ఆసిఫాబాద్, మార్చి 5: వాహనదారులు నిబంధనలు పాటించాలని సీఐ సతీష్ అన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలో బుధవారం ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు సీఐ సతీష్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబరు ప్లేట్లు లేని 40 వాహనాలను గుర్తించి సీజ్‌చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నంబర్ ప్లేట్లు లేని వాహనాలు నడిపినట్లయితే చర్యలు తప్పవన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కచ్చితంగా కలిగి ఉండాలని సూచించారు.

గుండి వంతెన పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ రూరల్, మార్చి 5: ఆసిఫాబాద్ మండలం గుండి వంతెన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతూ సీఎంపేసీలో నిర్వహించిన ప్రజావాణిలో గుండి మాజీ ఎంపీటీసీ రవీందర్ ఫిర్యాదు చేశారు. గుండి పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే వర్షాకాలం లోపు వంతెన పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 5: మండలం కేంద్రంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సంస్కృతిక సారధి కళాబృందం, డీపీఆర్‌వో ఆధ్వర్యంలో కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆట పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బృందం టీం లీడర్‌మోహన్ నాయక్, బాబు, వెన్నెల, శిరీష, సోమశేఖర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

జీరో విద్యుత్ బిల్లులు అందజేత


సిర్పూర్(టి), మార్చి 5: మండలంలోని పలువురు లబ్ధిదారులకు జీరో బిల్లును మంగళవారం విద్యుత్ శాఖ ఏఈ ఇర్ఫాన్ అహ్మద్ అందజేశారు. విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని, 200 యూనిట్లలోపు ఉన్న వారికి జీరో బిల్లులు వస్తాయని తెలిపారు.

మండలంలో మాజీ ఎమ్మెల్యే పర్యటన

సిర్పూర్(టి), మార్చి 5: సిర్పూర్(టి) మండలంలో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కౌటాల మండలం తలోడి గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్తూ మార్గ మధ్యలో గల సిర్పూర్(టి) మండల కేంద్రంలో కార్యకర్తలను కలిసి వారితో ముచ్చటించారు. ఆమె వెంట నాయకులు తిరుపతి, తదితరులు ఉన్నారు.

'అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా'

బెజ్జూరు, మార్చి 5: ఆదిలాబాద్ ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అవకావం ఇస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని నాయకుడు ఆత్రం భాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటమన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం ఇస్తే పోటీ చేసేందుకు సిద్ధమని తెలిపారు. సమావేశంలో శంకర్, హకీం, లక్ష్మణ్, విష్ణుమూర్తి, బాబురావు పాల్గొన్నారు.



మహిళలు అభివృద్ధి సాధించాలి

- సేవా సమితి అధ్యక్షురాలు సవిత మనోహర్


పోటీలను ప్రారంభిస్తున్న సేవా సమితి అధ్యక్షురాలు సవిత మనోహర్

మందమర్రి టౌన్, మార్చి 5: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సేవా సమితి అధ్యక్షురాలు సవిత మనోహర్ అన్నారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 8న మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ముందస్తుగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏరియాలో దాదాపు 200 మందికి పైగా పని చేస్తున్నారని, వారందరిని కూడా వేడుకలకు ఆహ్వానించి అభినందించనున్నట్లు వివరిం చారు. మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని తెలిపారు. అనంతరం మహిళలకు త్రోబాల్, బాంబ్ బ్లాస్ట్, మ్యుజికల్ ఛైర్ , ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె త్రో బాల్ వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, కమ్యునికేషన్ సెల్ సేవా సమితి కోఆర్డినేటర్ ఎండి ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మార్చి 5: ఆర్‌కే 5 గనిలో పనిచేసే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఆర్‌కె 5 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మేనేజర్ అబ్దుల్ ఖాదిర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాత ఎస్‌డీఎల్ స్థానంలో కొత్త యంత్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్‌కే 5 క్రెడిట్ సొసైటీలో ఉన్న రూ. కోటి పది లక్షలు, రూ.6 లక్షల 30 వేలను సభ్యులకు పంచాలన్నారు. క్యాంటీన్‌లో నాణ్యమైన టిఫిన్లు అందించాలని చెప్పారు. 4 సీమ్ 1 డిప్‌లో గాలి అందేలా చూడాలని, మొదటి షిఫ్టులో ఎక్కువ మంది కార్మికులు ఉన్నందున మ్యాన్‌రైడింగ్‌ను ఉదయం 9 గంటల వరకు నడపాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికి మేనేజర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉ ప ప్రధాన కార్యదర్శులు కె. వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, ఏరియా కార్యదర్శి ప్రసాదరెడ్డి, నాయకులు బుచ్చయ్య, నర్సింగరావు, మల్లేష్, జీపీ రావు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.


మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మిక హక్కుల సాధనే ధ్యేయం



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న సలేంద్ర సత్యనారాయణ

మందమర్రి టౌన్, మార్చి 5 : సింగరేణిలో కార్మికుల హక్కుల సాధన కోసం వెనుకాడే ప్రసక్తి లేదని గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఏరియా వర్క్‌షాపులో కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఏటా నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తున్న కార్మికులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. ఏరియాలోని ఆయా గనులలో, డిపార్టుమెంట్లలో పాడైన పరికరాలు వర్క్‌షాపులోనే మరమ్మత్తులు చేయనున్న దృష్ట్యా వారికి సరిపడా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకం ఉంచి గెలిపించిన కార్మికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తామన్నారు. అంతకు ముందు అధికారుల దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బీమనాథుని సుదర్శన్ నాయకులు ముల్కల్లపెల్లి వెంకటేశ్వర్లు, పెద్దపల్లి బానయ్య, ట్రేడ్ మెన్ నాయకులు టేకుమట్ల తిరుపతి, రాజేషం, మష్క భూమయ్య పాల్గొన్నారు.